క్లుప్తంగా

ఎంజేపీ ప్రిన్సిపాల్‌గా రాజేష్



మహబూబాబాద్ అర్బన్: మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్‌గా దేవులపల్లి రాజేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో హుజురాబాద్ సైదపూర్ గురుకుల పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన అనిత పదోన్నతిపై హైదరాబాద్‌లోని శంషాబాద్ గురుకుల పాఠశాలకు వెళ్లారు.

ఎస్పీని కలిసిన ఏఎస్సైలు

మహబూబాబాద్ రూరల్: ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌ను పదోన్నతి పొందిన ఇద్దరు ఏఎస్సైలు హనుమంతు, అబ్దుల్ మాజీద్ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి మొక్క, పూలబొకే అందజేశారు.

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

నెహ్రూసెంటర్: ఐకేపీ వీఓఏలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, వీఓఏల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెలిశాల సుధాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈనెల 10వ తేదీన జరిగే కార్మికుల డిమాండ్స్ డేను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వీఓఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చింత మౌనిక, కోశాధికారి ఆకుల వసంత, జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు పాల్గొన్నారు.

హాస్టళ్లపై నిర్లక్ష్యం తగదు

దంతాలపల్లి: ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం నిర్వహించే వసతి గృహాలపై నిర్లక్ష్యం తగదని, నిర్వాహకులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలకు వెనుకాడబోమని ఎంపీడీఓ వివేక్‌రామ్ అన్నారు. మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో ఎస్సీ బాలుర వసతిగృహాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజనం పరిశీలించారు. వసతి గృహంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి వెంటనే తీసుకురావాలని తెలిపారు. వసతి గృహంలో వార్డెన్ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోమారు వచ్చినప్పు వసతిగృహంలో వార్డెన్ ఉండాలని సూచించారు.

నోట్ బుక్స్ పంపిణీ



నెల్లికుదురు: ఇనుగుర్తి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుకున్న 1986–87 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఇనుగుర్తి మండలంలోని చిన్ననాగారం, అయ్యగారిపల్లి, ఇనుగుర్తి ప్రభుత్వ పాఠశాలల్లో చదువు కుంటున్న విద్యార్థులకు రూ.60వేల విలువ చేసే నోట్ బుక్స్‌లను అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చంద్రప్రకాష్, సాంబయ్య, శ్రీరాములు, శ్రీనివాసరెడ్డి, బాలకృష్ణ, యాకాంతం పాల్గొన్నారు.

టై, బెల్ట్, బ్యాగులు..

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారం ప్రభుత్వ పాఠశాలలో సోమవారం గార్లపాటి సత్యమ్మ జ్ఞాపకార్థం మేరకు విద్యార్థులకు టై, బెల్ట్, బ్యాగులు గార్లపాటి రామచంద్రరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆరుద్ర వెంకటేశ్వర్లు శరత్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, సరళరెడ్డి, స్థానిక వార్డు కౌన్సిలర్ కోడి నాగలక్ష్మి శ్రీనివాస్, హెచ్‌ఎం శ్రీనివాస్, చైర్మన్ చిత్తారి కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి వినతి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో గరీబ్‌రథ్, గ్రాండ్ ట్రంక్, వందే భారత్, ఏపీ, సంఘమిత్ర, రప్తి సాగర్, గంగా కావేరి రైళ్ల నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ జిల్లా కోశాధికారి ఓలం శ్రీనివాసరావు సోమవారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి సోమన్నకు వినతిపత్రం అందజేశారు.

ఆర్థికసాయం

కురవి: మండల కేంద్రంలో కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో ధర్మవరపు శశిరేఖ మృతి చెందగా అనాథకు మారిన ఆమె కూతురు మానసకు రూ. 73వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాన్ని సోమవారం అందజేశారు. కురవికి చెందిన గంగరబోయిన రఘు అనే యువకుడు తన సోషల్ మీడియా, ద్వారా వచ్చిన డబ్బులను ఏపీజీవీబీ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాలిక మానసకు పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, ప్రశాంత్, భరత్, శ్రీను, కల్యాణ్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

దంతాలపల్లి: వర్షాకాలంలో రాబోయే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పల్లెదవాఖాన వైద్యురాలు వాణి అన్నారు. మండలంలోని తూర్పుతండా గ్రామపంచాయితీలో సోమవారం ఆరోగ్యశిబిరం నిర్వహించారు.

పెద్దవంగర: వ్యక్తిగత శుభ్రత పాటిస్తే రోగాలు దరి చేరవని పల్లె దవాఖాన వైద్యుడు రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని వడ్డెకొత్తపల్లిలో వైద్యశిబిరం నిర్వహించారు.

కేసముద్రం: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కురవి: సీరోలు మండలం కొత్తూరు(సీ)లో..



గూడూరు: గుండెంగలో..



నెల్లికుదురు: ఇనుగుర్తి మండలం చిన్ననాగారంలో..



మహనీయుడు వైఎస్సార్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటం, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి పేదల గుండెల్లో నిలిచిన గొప్ప నేత వైఎస్సార్ అని కొనియాడారు. - సాక్షి నెట్‌వర్క్



బయ్యారం: రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు



గార్లలో..



తొర్రూరు: నివాళులర్పిస్తున్న నాయకులు



నెల్లికుదురు: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ..



పెద్దవంగర: వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అంగన్‌వాడీల రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలి



అధికారికి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

మహబూబాబాద్: అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి స్నేహబిందు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వీఆర్‌ఎస్ సౌకర్యం కల్పించాలని, అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి అంగన్‌వాడీలపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. పాత జీఓ 10ని అమలు చేసి తక్కువ డబ్బులు ఇచ్చి, 65 సంవత్సరాలు దాటిన వారిని జూలై 1నుంచి ఇంటికి పంపాలని నిర్ణయించడం దుర్మార్గం అన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తిరుపతమ్మ, మంగ, ఎల్లమ్మ, మంగమ్మ, వీరమ్మ, అలీమా, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడులు హేయమైన చర్య



కోర్టులో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

తొర్రూరు: న్యాయవాదులపై దాడులు హేయమైన చర్య అని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కల్వకొలను ప్రవీణ్‌రాజు అన్నారు. వరంగల్, భద్రాచలంలో న్యాయవాదులపై దాడులను ఖండిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో న్యాయవాదులు నిరసన చేపట్టారు. ప్రవీణ్‌రాజు మాట్లాడుతూ.. న్యాయవాదులపై కక్షిదారులు, పోలీసుల దాడులు దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఘనపురం రామకృష్ణ, ప్రతినిధులు అలువాల శ్రీశైలం, సైదులు, మాదగాని నాగరాజు, ప్రేమ్‌చందర్, బండపల్లి వెంకన్న, వల్లపు మహేష్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అందని గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీ



ధర్నా చేస్తున్న నాయకులు

గార్ల: గ్యాస్ సిలిండర్, విద్యుత్ సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరికీ న్యాయం చేయాలంటూ సీపీఎం నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీపీఎం జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాసరావు మాట్లాడారు. గతంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో గ్యాస్, విద్యుత్ సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు అధికారుల తప్పిదం వలన నేటికీ గ్యాస్, గృహజ్యోతి పథకాలకు దూరమయ్యారని ఆరోపించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రవీందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు హరినాయక్, పెద్దవెంకటేశ్వర్లు, ఎల్లయ్య, రామకృష్ణ, శ్రీనివాసరావు, అశోక్, వీరన్న, కొండయ్య, రాంబాబు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన బిల్లులు విడుదల చేయాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిర్వాహకుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సోమవారం సందర్శించి విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఈసందర్భంగా కిరణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 9నెలల నుంచి మధ్యాహ్న భోజనం బిల్లులు విడుదల కావడం లేదన్నారు. మన ఊరు– మన బడి పథకం కింద పనులు మంజూరైన దానిని పూర్తి చేయడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పట్ల మధు, జిల్లా కమిటీ సభ్యుడు సూర్యప్రకాష్, జ్యోతిబసు, సింహాద్రి, రాజేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ.. 24 గంటల్లో గుర్తింపు

కొత్తగూడ: ద్విచక్రవాహనం చోరీకి గురైన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. వేలుబెల్లి గ్రామానికి చెందిన మహేష్ మండల కేంద్రంలోని నాగేంద్ర పురుగుమందుల షాపులో పని చేస్తున్నాడు. విధులు ముగించుకొని ఇంటికి వెళ్దామని ద్విచక్రవాహనం వద్దకు వెళ్లాడు. చూస్తే ద్విచక్రవాహనం కనిపించలేదు. మండల కేంద్రంలో మొత్తం వెతికినా కనిపించలేదు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి ఎస్సై దిలీప్ సీసీ పుటేజీ ఆధారంగా నిందితున్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. డూప్లికేట్ తాళాలతో బండి చోరీ చేసినట్లు సీసీ కెమెరాలో రికార్డు అయింది. కొత్తగూడ మండలం ఓటాయి గ్రామానికి చెందిన శరత్‌గా గుర్తించారు. శరత్ నర్సంపేట పట్టణంలో నివాసం ఉంటున్నట్లు తెలుసుకుని అరెస్ట్ చేశారు. 24గంటలు గడవకముందే దొంగను గుర్తించి అదుపులోకి తీసుకోవడంతో బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు. కాగా మంగళవారం నిందితున్ని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోశాలలోని గోవులను రక్షించాలి

తొర్రూరు: గోవుల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న స్థానిక గోశాల నిర్వాహకులపై చర్య తీసుకోవాలని గోశాల వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుమ్మడవెల్లి శ్రీనివాస్ అన్నారు. గోవుల సంరక్షణ కోసం సాధు సంతుల ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విశ్రాంతి భవనం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. గోవులను కాపాడాల్సిన గోశాల నిర్వాహకులు అవి అనారోగ్యం పాలవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సాధువులు అరిహోం, అతిదేశ్వర పర్వత స్వామి, నాగనందగిరి స్వామి, దేవకీ మాతాజీ, పద్మ, హిందూ ధర్మ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మండల భూపాల్, ప్రతినిధులు భూపాల్, రణధీర్, భూలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



మహబూబాబాద్: సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

మహబూబాబాద్: అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో సోమవారం మున్సిపాలిటీ సాధారణ నిధులతో రూ.5లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మానుకోట మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. అన్ని వార్డుల్లో ఉన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. ప్రధానంగా తాగునీటి సమస్యతోపాటు పారిశుద్ధ్య సమస్య లేకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైఎస్ చైర్మన్ మార్నెని వెంకన్న, కమిషనర్ నోముల రవీందర్, డీఈ సీహెచ్ ఉపేందర్, ఏఈ సురేష్, కౌన్సిలర్లు పోతురాజు, వెంకన్న, హరిసింగ్, జగన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

గూడూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మధుగౌడ్, శ్రీపాల్‌రెడ్డి, కొమ్మాలు, మధుగౌడ్, వీరస్వామి, నరేష్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

భూమి పూజ చేసిన ఎమ్మెల్యే

నెల్లికుదురు: మండలంలోని నైనాల గ్రామ స్టేజి ప్రధాన రహదారి వద్ద గ్రామ మాజీ సర్పంచ్ యాకసాయిలు తాత జ్ఞాపకార్థం సుమారు రూ.5లక్షలతో నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి కళాతోరణ నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే మురళీనాయక్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్, నాయకులు సత్యపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సమరం, యాకయ్య, మహేందర్, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే జెన్నారెడ్డి జనార్దన్ రెడ్డి స్ఫూర్తిదాయకులని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే జెన్నారెడ్డి జనార్ధన్ రెడ్డి జయంతి సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని అనంతాద్రిలో గల ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ కోడి నాగలక్ష్మి శ్రీను, గార్లపాటి సాయితేజ, మైనార్టీ నాయకులు ఖలీల్, జమీల్, ఫిరోజ్, ఫయాజ్, ఎడ్ల రమేష్, శంతన్ రామరాజు, బొల్లు రాజు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

దంతాలపల్లి: గ్రామపంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శులు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ వివేక్‌రామ్ అన్నారు. మండంలోని ఆగపేట, నిదానపురం గ్రామాలలో సోమవారం రికార్డులను ఎంపీడీఓ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ అప్సర్‌పాషా, టెక్నికల్ అసిస్టెంట్ ప్రవీణ్ పాల్గొన్నారు.

కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

గూడూరు: మహబూబాబాద్ జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం అడ్మిషన్లు మంగళవారం నుంచి స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్వేత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం



డోర్నకల్: ఇటీవల పదోన్నతులు పొందిన పలువురు ఉపాధ్యాయులను సోమవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, సంఘం జిల్లా నాయకుడు మురళీకృష్ణ, నర్సింహరావు, మల్లేశ్వర్‌రావు పాల్గొన్నారు.

పెద్దవంగర: మండలంలోని చిట్యాల కాంప్లెక్స్ పరిధిలోని పలు పాఠశాలల్లో విధులు నిర్వహించి ఇటీవల బదిలీ, పదోన్నతులపై వెళ్లిన ఉపాధ్యాయులకు సోమవారం కాంపెక్స్‌లో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయ్‌కుమార్, మండల నోడల్ అధికారి బుదారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బందోబస్తు నడుమ శంకుస్థాపన

గూడూరు: మండల కేంద్రంలోని చెంద్రుగూడెం శివారులో వ్యవసాయ సాగు భూమిలో సోమవారం పోలీసు బందోబస్తు నడుమ కొత్తగా నిర్మాణమయ్యే ఏకలవ్య పాఠశాల భవన సముదాయానికి అధికారులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆర్సీఓ రాజ్యలక్ష్మి, డీఎస్పీ తిరుపతిరావు, సీఐ బాబూరావు, ఏఈ చందర్‌రావు, ఎస్సైలు నగేష్, రవికుమార్ పాల్గొన్నారు.

హాస్టల్ తనిఖీ

నర్సింహులపేట: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను సోమవారం తహసీల్దార్ నాగరాజు తనిఖీ చేశారు. హాస్టల్‌లోని విద్యార్థుల నమోదును, స్టాక్‌ను పరిశీలించారు. మోనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు.

విద్యార్థులకు అభినందన

మహబూబాబాద్ అర్బన్: కాకతీయ యూనివర్సిటీ విడుదల చేసిన 6వ సెమిస్టర్ డిగ్రీ ఫలితాల్లో నలంద డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని కళాశాల కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ అన్నారు. సోమవారం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ శంకర్ పాల్గొన్నారు.

జాతర నిర్వహణ జీపీకే ఇవ్వాలి

కొత్తగూడ: గుంజేడు జాతరలో వాహనాల టికెట్, దుకాణాల శిస్తు వసూలు చేసే బాధ్యత గ్రామ పంచాయతీకే ఇవ్వాలని సోమవారం జరిగిన పీసా గ్రామ సభలో కమిటీ తీర్మానం చేసింది.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

మరిపెడ: విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరబాబు కోరారు. ఈమేరకు సోమవారం ఆర్‌సీఓ రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఆయనతోపాటు సందీప్, ప్రణయ్‌కుమార్, వాసు పాల్గొన్నారు.

గుంత పూడ్చివేత

నర్సింహులపేట: మండలంలోని గోల్‌బొడ్కతండా గ్రామ పంచాయతీ పరిధిలో ధన్‌సింగ్ తండా నుంచి నర్సింహులపేట వచ్చే బీటీ రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంతను ఎస్సై గండ్రాతి సతీష్ పరిశీలించారు. సోమవారం ఎస్సై సొంత ఖర్చులతో 15పైగా ట్రిప్పుల మొరం పోయించి గుంతను పూడ్చించాడు. కార్యక్రమంలో హెచ్‌సీ కృష్ణ, పీసీలు శ్రీనువాస్, రమేష్ పాల్గొన్నారు.

అక్షరాభ్యాసం

నెల్లికుదురు: మండలంలోని మేచరాజుపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం మాజీ ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి నవీన్‌రావు, మాజీ సర్పంచ్ వెలిశాల లక్ష్మి దేవేందర్‌ల ఆధ్వర్యంలో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు సోమవారం అక్షరాభ్యాసం చేయించినట్లు కాంప్లెక్స్ హెచ్‌ఎం జె.మంగతాయి తెలిపారు.

క్షయ వ్యాధి పరీక్షలు చేయించుకోవాలి

గూడూరు: ప్రతీ ఒక్కరు స్వచ్ఛందంగా క్షయ వ్యాధి పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ యమున అన్నారు. మండలంలోని భూపతిపేట శివారు కారంపాడి తండాలో సోమవారం క్షయ వ్యాధి నిర్మూలన ఉచిత పరీక్షల శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది కోమల, లోక్యా నాయక్, గణేష్, హేమలత పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

గార్ల: చిన్నకిష్టాపురం పంచాయతీలో పారిశుద్ధ్యం లోపించడానికి కారకులైన పంచాయతీ కార్యదర్శిపై చర్య తీసుకోవాలని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి జి.సక్రు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రజినికి సోమవారం వినతిపత్రం అందజేశారు.

నేడు సీత్లా పండుగ

మరిపెడ రూరల్: సీత్లా భవాని పండుగను వేర్వేరు తేదీల్లో కాకుండా నేడు జరుపుకోవాలని ఐక్యవేదిక (లైవ్) జిల్లా అధ్యక్షుడు రమేష్‌నాయక్ సోమవారం తెలిపాడు.

రుణాలు ఇప్పించండి

మహబూబాబాద్ అర్బన్: వీధి వ్యాపారులకు రుణాలు ఇప్పించాలని వ్యాపారులు వనగండ్ల విజయ, పత్తి గీత అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఆర్డీఏ, మెప్మా కార్యాలయానికి నర్సింహులగూడేనికి చెందిన దివ్యాంగ మహిళలు మెప్మా అధికారి విజయ కుమారికి వినతిపత్రం సోమవారం అందజేశారు.


సబ్‌స్టేషన్ పనుల పరిశీలన

కేసముద్రం: మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న సబ్‌స్టేషన్ పనులను ప్రాజెక్టు ఇన్‌చార్జ్ డైరెక్టర్ సదర్‌లాల్ సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో సీఈఎస్‌ఎస్ గుట్ట, ఎస్‌ఈ నరేష్, డీఈలు విజయ్, హర్షి, మధుసూదన్ పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

డోర్నకల్: మండలంలోని బోడ్యాతండాలోని పలు ఇళ్లపై పోలీసులు దాడులు నిర్వహించి 300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి ఆరు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. బోడ కాంతిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

చిన్నారుల సంక్షేమమే ఐసీడీఎస్ లక్ష్యం



పెద్దవంగర: అంగన్‌వాడీ కేంద్రం అమ్మ ఒడిలాంటిదని, చిన్నారుల సంక్షేమమే ఐసీడీఎస్ లక్ష్యమని అంగన్‌వాడీ టీచర్ పులుగుజ్జ రాజేశ్వరీ తెలిపారు. సోమవారం మండలంలోని చిట్యాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో మూడేళ్లలోపు చిన్నారులను చేర్పించాలని కోరారు. ప్రభుత్వం అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వందేమాతరం ఆధ్వర్యంలో బాసర నుంచి పూజలు చేసిన పలుకలను సంస్థ ప్రతినిధి ఆకుతోట జ్యోతి 17మంది చిన్నారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

తమ్ముడు పంచాయితీకి పిలిపించాడని అన్న ఆత్మహత్య

బయ్యారం: అమ్మనాన్న చనిపోయినా కంటికి రెప్పలా పెంచుకున్న తమ్ముడు పదిమందిలో పంచాయితీకి పిలిపించాడనే మనస్తాపంతో పురుగుల మందు తాగి అన్న ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పెంకుతండాలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన మాళోత్ వెంకన్న(40) తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోవడంతో తమ్ముడు మోహన్‌తోపాటు చెల్లిని పెంచి పెళ్లి చేశాడు. ఈక్రమంలో కుటుంబ సమస్యలపై తమ్ముడు మోహన్ అన్నపై తండా పెద్దలకు ఫిర్యాదు చేయగా ఆదివారం తండాలో పెద్దమనుషులు పంచాయితీ నిర్వహించారు. పంచాయితీ ద్వారా తనకు అవమానం జరిగిందని మనస్తాపానికి గురైన వెంకన్న పురుగులమందు తాగాడు. జిల్లా ఆసుపత్రికి తరలించగా సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు ఎస్సై ఉపేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎస్.కె. అన్వర్ పాషా, (S.R) : 7997958185
ఐ. సతీష్ (S.R) (డోర్నకల్) : 9640394736
ఎం. మురళి, (S.R) (తొర్రూరు) : 7680822646